జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 65 | ఆదివారం 27 జూలై 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## కార్గిల్ విజయ్ దివస్..
## అమర వీరులకు రాష్ట్రపతి, ప్రధాని నివాళి




ఇంటర్నెట్ డెస్క్:జూలై 26(సందేశం టైమ్స్) : కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ.. అమర జవాన్లకు నివాళులు అర్పించారు. నాటి యుద్ధంలో పాక్‌పై విజయం కోసం జవానులు చేసిన త్యాగాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రధాని, రాష్ట్రపతితో పాటు త్రివిధ దళాధిపతులు కూడా అమర జవాన్‌లకు నివాళులు అర్పించారు.మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్‌లకు తాను నివాళులు అర్పిస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్స్ వేదికగా స్పందించారు. దేశ సైనికుల ధైర్యసాహసాలు, సడలని పట్టుదలకు ఈ రోజు చిహ్నమని వ్యాఖ్యానించారు. వారి త్యాగాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ కూడా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత మాత బిడ్డల ధైర్యసాహసాలు, త్యాగాలను ఈ రోజు గుర్తుకు తెస్తోందని అన్నారు. భారత్ సగర్వంగా తలెత్తుకునేలా జవాన్‌లు తమ జీవితాలను అంకితం చేశారని వ్యాఖ్యానించారు.

## ప్రపంచంలో
## అత్యంత విశ్వసనీయ నేతగా ప్రధాని మోదీ




ఇంటర్నెట్ డెస్క్:జూలై 26(సందేశం టైమ్స్) : ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ నేతగా ప్రధాని మోదీ మరోసారి టాప్‌లో నిలిచారు. మార్నింగ్ కన్సల్ట్ సంస్థ గ్లోబల్ లీడర్ సర్వేలో మరోసారి తన ఆధిక్యాన్ని నిలుపుకున్నారు. సర్వేలో ప్రధాని మోదీకి అత్యధిక శాతం మంది మద్దతు ప్రకటించడంలో అప్రూవల్ రేటింగ్స్ ఏకంగా 75 శాతానికి చేరాయి. ఈ ఏడాది జులై 4 నుంచి 10 తేదీల మధ్య సర్వేను నిర్వహించారు.ఈ సర్వేలో ప్రధాని నెం.1గా నిలవడంపై బీజేపీ సీనియర్ నేత అమిత్ మాల్వీయ సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారతీయులతో పాటు ప్రపంచవ్యాప్తంగా మిలియన్‌ల మంది ప్రజల గౌరవాభిమానాలు చూరగొన్న నేతగా ప్రధాని నిలిచారని అన్నారు. అత్యధిక అనుకూల రేటింగ్స్ కలిగిన నేతగా ఉన్నారంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. బలమైన నాయకత్వం, ప్రపంచ వ్యాప్తంగా గౌరవాభిమానాలు పొందే నేత సారథ్యంలో భారత్ భద్రంగా ఉందని కామెంట్ చేశారు.

## యశోద ఆస్పత్రిలో
## క్యాన్సర్ల సర్జరీలపై లైవ్ వర్క్‌షాప్

హైదరాబాద్, జూలై 26(సందేశం టైమ్స్) : యశోద హాస్పిటల్స్ –హైటెక్ సిటీలోని సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ అండ్ రోబోటిక్ సైన్స్ విభాగం జీఐ–ఫోకస్ పేరుతో రెండు రోజుల జాతీయ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్ షాప్ ను నిర్వహించడం జరిగింది. అప్పర్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ (జీఐ) క్యాన్సర్ వరకు, గ్యాస్ట్రోఇంటెస్టినల్ వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్య విదానాలను దేశంలోనే ప్రసిద్ధ జాతీయ సర్జికల్ గ్యాస్ట్రో, సర్జికల్ ఆంకాలజీ అండ్ జనరల్ సర్జరీ రంగాల నుండి 500మందికి పైగా సర్జన్లతో ప్రత్యక్ష లైవ్ వర్క్ షాప్ అండ్ ఇంటరాక్టివ్ శిక్షణా సెషన్స్ నిర్వహించారు.ఈసందర్భంగా యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్.జి.ఎస్.రావు మాట్లాడుతూ అధునాతన లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జికల్ ఎక్సలెన్స్ ద్వారా మాత్రమే కాకుండా, వైద్య నిపుణులతో వారి అనుభవాలను పంచుకునే ఇలాంటి వేదికల ద్వారా కూడా రోగికి మెరుగైన ఫలితాలను అందించవచ్చని ఇలాంటి సదస్సులు నిరూపిస్తున్నాయన్నారు. ప్రత్యేక సంరక్షణ అవసరమయ్యే వ్యాధుల పెరుగుదల, సంక్లిష్టతకు ప్రతిస్పందనగా, యశోద హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో బారియాట్రిక్, హెర్నియా, ప్యాంక్రియాస్, రోబోటిక్, లివర్ క్లినిక్‌లతో సహా స్పెషాలిటీ క్లినిక్‌లను ప్రారంభించినట్లు తెలిపారు.

## జైపాల్ రెడ్డి డెమోక్రసీ అవార్డు ప్రదానోత్సవంలో సీఎం రేవంత్ ఉద్బోధ






హైదరాబాద్, జూలై 26(సందేశం టైమ్స్) :నాటి ఐడియాలజికల్ పాలిటిక్స్ పోయి ఇవాళ స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయన్నారు సీఎం రేవంత్ రెడ్డి. దేశ రాజకీయాల్లో సైద్ధాంతిక రాజకీయాలు పోయి, మేనేజ్మెంట్ పాలిటిక్స్ కీరోల్ ప్లే చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు పోయి వాలంటీర్ వ్యవస్థ వస్తోందన్నారు. కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్ కు ప్రమాదకరమన్న రేవంత్.. యూనివర్సిటీలలో విద్యార్థి రాజకీయలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు.దేశ రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గించాల్సిన అవసరం ఉందని, ప్రతిపక్షాలు సహేతుకమైన సూచన చేస్తే తీసుకోవడానికి మాకు ఇబ్బంది లేదని రేవంత్ స్పష్టం చేశారు. అందుకే తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు శాసనసభ నుంచి ఎవరినీ సస్పెండ్ చేయలేదని కూడా రేవంత్ రెడ్డి చెప్పారు.దేశ రాజకీయాల్లో జైపాల్ రెడ్డి ఒక నిలువెత్తు శిఖరం అని కొనియాడిన రేవంత్ రెడ్డి.. పీవీ, జైపాల్ రెడ్డి లాంటి వారి స్ఫూర్తి తెలంగాణ రాజకీయాల్లో ఉండాలని ఆకాంక్షించారు. 'జైపాల్ రెడ్డి డెమోక్రసీ అవార్డు' ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక అంశాలపై కూలంకషంగా మాట్లాడారు. విద్యార్థి నాయకుడిగా, శాసన సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా వివిధ హోదాల్లో జైపాల్ రెడ్డి గారు పని చేసి, దేశానికే తలమానికమైన పనులు చేశారని చెప్పారు.

## సిలారపు రాజనర్సింహాకు
## మంత్రి దామోదర్ నివాళులు



మెదక్,జూలై 26(సందేశం టైమ్స్) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి , బడుగు, బలహీన, దళిత వర్గాల అభ్యున్నతి కోసం శాసనసభ్యులుగా, చట్టసభలలో సుదీర్ఘ పోరాటం చేసిన దార్శనికులు సిలారపు రాజనర్సింహ వర్ధంతి సందర్భంగా వారి తనయుడు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి లోని వారి నివాసంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాజనర్సింహ అందించిన సేవభావాన్ని, రాజకీయ విలువలను, ఆశయాలను, అందోల్ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం చేసిన కృషిని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్మరించుకున్నారు. అందోల్ నియోజక వర్గం నుండి 1967, 1972, 1978 శాసన సభ్యులు గా హ్యాట్రిక్ సాధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రిగా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సుదీర్ఘ కాలం పాటు సేవలను అందించి చిరస్థాయిగా నిలిచారని మంత్రి దామోదర్ రాజనర్సింహ కొనియాడారు.

## ఆ ఆరోపణలు నిరూపించు..
## కేటీఆర్‌కి ఎంపీ రమేష్ మాస్ సవాల్



అనకాపల్లి, జూలై 26(సందేశం టైమ్స్) : తెలంగాణ మాజీమంత్రి కేటీఆర్ తనపై చేసిన తప్పుడు ఆరోపణలపై మీడియా ముందు బహిరంగ చర్చకి రావాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సవాల్ విసిరారు. తెలంగాణలో తనకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.1650 కోట్లతో నామినేషన్ వర్క్ ఇచ్చారని అవగాహన లేకుండా కేటీఆర్ మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ఇవాళ(శనివారం) అనకాపల్లి జిల్లాలో ఎంపీ సీఎం రమేష్ మీడియాతో మాట్లాడారు. గత పదేళ్లు అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో రిత్వి ప్రాజెక్ట్ రూ.2000 కోట్లతో పనులు చేపట్టారని... వాటిని నామినేషన్ కింద ఇచ్చారా అని ప్రశ్నించారు ఎంపీ సీఎం రమేష్.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బురద జల్లాలని తనపై కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మోహన్ రెడ్డికి ఇంట్లో కుంపటి ఉన్నట్లుగానే.. తెలంగాణలో కేటీఆర్‌కి ఉందని ఆరోపించారు. దీని నుంచి ప్రజలను మభ్యపెట్టడానికి కేటీఆర్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత జైల్లో ఉన్నప్పుడు ఢిల్లీలో తన ఇంటికి వచ్చి కేటీఆర్ కలిసిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. తమపై వచ్చిన కేసులను తొలగిస్తే బీజేపీతో బీఆర్ఎస్‌ను విలీనం చేయడానికి సిద్ధమేనని చెప్పిన మాటలపై కేటీఆర్ సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు ఎంపీ సీఎం రమేష్.రాబోయే ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ కలసి పోటీ చేస్తాయనే భయాందోళనలతో మాజీ మంత్రి కేటీఆర్ ఉన్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణలో బీజేపీ, టీడీపీ కలిసి పోటీ చేస్తే కేటీఆర్‌కి ఏంటి బాధ అని ప్రశ్నించారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతుగా ఉన్నారని రెడ్లను, ఏపీలో చంద్రబాబుకు మద్దతుగా ఉన్నారని కమ్మ కులస్తులను కేటీఆర్ విమర్శించిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. కేటీఆర్ చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఛాలెంజ్ చేశారు. కేటీఆర్ తెలంగాణ, ఏపీతోపాటు, దేశ ప్రజలందరికీ జవాబు చెప్పాలని ఎంపీ సీఎం రమేష్ డిమాండ్ చేశారు.

# బి ఆర్ యస్ కార్యకర్తను పరామర్శించిన అందోల్ మాజీ ఎమ్మెల్యే .. క్రాంతి కిరణ్



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 26జులై సంగారెడ్డి జిల్లా అందోల్ మండల్ లోని జోగిపేట మొగులయ్య ఆటో యాక్సిడెంట్ అయింది, ప్రక్కల వెన్నుముకలు విరిగినవి ఆరోగ్య పరిస్థితి సీరియస్ గా ఉన్నదని తెలిసిన వెంటనే అందోల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ శనివారం రోజున సంగారెడ్డి హాస్పిటల్ లో చేరుకొని నేనున్నాని మనోధైర్యాన్ని ఆటో యూనియన్ మొగులయ్యకు భరోసా ఇచ్చారు ఇందులో బిఆర్ఎస్ సీనియర్ లీడర్ జయపాల్ రెడ్డి,మునిపల్లి మాజీ జడ్ పి టీ సి సాయి కుమార్, అందోల్ జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ ఐదో వార్డు సంతోష్ కుమార్, బబ్లు, గఫూర్ తాజ్,బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ,ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి

## శరత్ ఐఏఎస్ జిల్లా కలెక్టర్ పి ,ప్రావీణ్య



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 26జులై సంగారెడ్డి జిల్లా కలెక్టరెట్ లో ప్రత్యేక అధికారి తో వివిధ శాఖల అధికారులతో సమీక్ష జిల్లా లో భారీ వర్షాలు కారణంగా ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలపైనా చర్యలు , వ్యవసాయం, వర్షాకాలం సన్నద్ధత, ఎరువుల లభ్యత, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణ పై ఆరోగ్య శాఖ పర్యవేక్షణ చర్యలు ,నూతన రేషన్ కార్డుల ధ్రువీకరణ, రేషన్ కార్డుల పంపిణీ, మూడు నెలల బియ్యం పంపిణీ వివరాలు , పాఠశాలలు, బాలికల వసతి గృహాల పరిశీలనకు సంబందించిన వివరాలు, పాఠశాలలు %-% వసతి గృహాల మధ్యాహ్న భోజన నాణ్యత, మౌలిక సదుపాయాలపై తదితర అంశాలపై ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి శరత్ ఐఏఎస్ విస్తృతంగా సమీక్షించారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ: మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్,జూలై 26(సందేశం టైమ్స్) : చారిత్రాత్మకమైన చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ మన రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఆలోచనలు ఏమైనా, భావజలాలు ఏమైనా స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, అన్ని హక్కుల్లో భావ ప్రకటన స్వేచ్ఛ చాలా ముఖ్యమని ఉద్ఘాటించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వార్షికోత్సవాన్ని ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఇవాళ(శనివారం జులై 26) ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మల్లు భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. యుద్ధం చేసి సాధించుకున్న తెలంగాణలో పది సంవత్సరాల కాలంలో అనేక రకాలుగా అనుభవించాల్సిన స్వేచ్ఛ జీవితాన్ని కోల్పోయామని తెలిపారు మల్లు భట్టి విక్రమార్క.

అలాగే పీపుల్స్ మార్చ్ సందర్భంగా ప్రజల సమస్యలను విన్నామని, కళ్లారా చూశామని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితులు మారాలని ప్రజా ప్రభుత్వంగా కలిసి ముందుకు వెళ్లాలని అనుకున్నామని, అది ఇప్పుడు తమ ప్రభుత్వంలో సాధించామని నొక్కిచెప్పారు. ఉన్నత విద్యను స్కిల్ బేస్డ్ నాలెడ్జ్ సెంటర్‌గా ప్రభుత్వ విశ్వ విద్యాలయాలను తయారు చేసే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగానే స్కిల్ యూనివర్సిటీనీ ఏర్పాటు చేశామని, అడ్వాన్స్ ట్రైనింగ్ సంస్థల ద్వారా ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించి యువతను ఉద్యోగులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విశ్వ విద్యాలయాల్లో అధ్యాపకుల నియామకం చేయబోతున్నామని చెప్పారు. ప్రతి బిడ్డకు ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ భాషగా ఉన్న ఇంగ్లీష్ భాషలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు మల్లు భట్టి విక్రమార్క.

దేశంలో మొదటిసారిగా, సమగ్రంగా కులగణన చేపట్టామని, దేశానికి ఆదర్శంగా నిలిచామని మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. ప్రపంచంతో పోటీ పడే విధంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. పేదల బతుకులు మారాలంటే విద్యను నిర్లక్ష్యం చేయొద్దని, బాగా చదివి తెలంగాణ, దేశ అభివృద్ధిలో భాగం అవ్వాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు అంశాలపై దృష్టిని కేంద్రీకరించిందని... ఒకటి విద్య, రెండు వైద్యం. రాష్ట్రంలో 104 యంగ్ ఇండియా స్పోర్ట్స్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. వీటి వల్ల తెలంగాణ ముఖ చిత్రం మారుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే దేశానికి ఒక ఉన్నత ప్రధానమంత్రి అందించిన ఘనత ఈ విశ్వవిద్యాలయనిదని ఉద్ఘాటించారు. పబ్లిక్ యూనివర్సిటీల్లోని అన్ని బకాయిలను చెల్లిస్తున్నామని ప్రకటించారు. ఆడిటోరియం నిర్మాణం కోసం అవసరమైన చర్యలపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను అలరించాయి. టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ చేసిన అంత్యాక్షరి కార్యక్రమం విద్యార్థులను ఉర్రూతలూగించాయి.

# కాశి జగద్గురు మహాస్వామి నీ ఆహ్వానించువారు

***టీపిసిసి ఉపాధ్యక్షులు పట్లోళ్ల సంగమేశ్వర్***




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లాప్రతినిధి 26జులై సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ మర్వేల్లి గ్రామం నికి ఆదివారం 27/7/2025నాడు సాయంత్రం. 5:00 గంటల సమయానికి కాశీ జగద్గురు మహాస్వామి గారు రావడం జరుగుతుంది శ్రీ పంచాలింగ మహాదేవుని దర్శనం చేసుకొని అక్కడ నుండి గురువర్యులను ర్యాలీలో పట్లోళ్ల సంగమేశ్వర్ పటేల్ స్వగృహామునకు తీసుకుపోవడం. ఆరోజు నా వారి గృహములో సేదా తిరుట జరుగుతుంది.. మరియు తదుపరి రోజూ అనగా తేది. 28/7/2025నాడు. శివ పార్వతుల పంక్షన్ హాల్లో సమయం (1)పొద్దునా 8:00గంటల నుండి 10:గంటల వరకు సామూహిక ఇష్టలింగ పూజ 400.నుండి500మంది తో జరుగుతుంది ఆరోజునా (లింగయత్ లు అందరూ లింగధారణ చేసుకొని రాగలరు)(2). 10:00నుండి 11:00గంటలవరకు నూతనంగా లింగధారణ చేసుకునే వారికీ లింగధారణ చేయడం జరుగుతుంది.. (3)11:00నుండి 12:00వరకు అయొక్క కాశీ జగద్గురు వారి పాదాపూజా జరుగుతుంది.. (4)1:00 సమయం లో భోజన కార్యక్రమం.(5)1:00 నుండి అప్పాగార్లు ప్రవచనం జరుగుతుంది ఈయొక్క కార్యక్రమం లో. మాల్కెడ్ అప్పగారు మరియు బిచ్కుంద సోమయప్ప గారు. కావులాస్ మల్లికార్జున అప్పగారు. బర్ధిపూర్ అప్పగారు.గట్టు మల్లన్న గారు.పాల్గొని వారి యొక్క ప్రవచనాలు తెలుపడం జరుగుతుంది. కావున గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అయొక్క జగద్గురు మరియు అప్పాగారుల ఆశీస్సులు పొందగలరు అన్ని మాజీ సర్పంచ్ పట్లోళ్ల శివశరణ్, పట్లోళ్ల పరమేశ్వర్ తెలియజేశారు

# జూరాలకు భారీ వరద.. 12 గేట్లు ఎత్తివేత !




జూలై 26(సందేశం టైమ్స్) : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి పెద్ద ఎత్తున ఇన్‌ఫ్లో రావడంతో జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. (శనివారం) సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి ప్రవేశించే వరద నీటి ప్రవాహం 75,000 క్యూసెక్కులుగా నమోదైంది. వరద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమై 12 గేట్లను ఎత్తి దిగువన శ్రీశైలం వైపు విడుదల చేశారు.ఇదిలా ఉండగా, జూరాల స్పిల్‌వే ద్వారా ప్రస్తుతం 47,000 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా.. పవర్ హౌస్ ద్వారా 34,286 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. కొయిలసాగర్ లిఫ్ట్ ద్వారా 315 క్యూసెక్కులు, నెట్టంపాడు లిఫ్ట్ ద్వారా 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 550 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 480 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కాల్వ ద్వారా 150 క్యూసెక్కులు, పారలల్ కెనాల్ ద్వారా 200 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-ద్వారా 750 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం డిమాండ్లు కలిపి 72,445 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టు నుంచి విడుదల అవుతోంది.జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు (9.657 టీఎంసీలు సామర్థ్యం) కాగా, ప్రస్తుతం నీటిమట్టం 317.680 మీటర్ల (1,042.257 అడుగులు) వద్ద ఉంది. ప్రాజెక్టులో మొత్తం నీటి నిల్వ 7.991 టీఎంసీలు ఉండగా, లైవ్ స్టోరేజ్ 4.284 టీఎంసీలుగా ఉంది.వరద ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు పర్యవేక్షణను మరింత కఠినంగా నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# సంపాదకీయం

## ధన్‌ఖడ్ ఉత్థాన పతనాలు

జూలై 10, 2025న జగదీప్ ధన్‌ఖడ్ చాలా సంతోషంగా ప్రకటించారు: 'సరైన సమయం%-%ఆగస్టు 2027%-% లో నేను పదవీ విరమణ చేస్తాను'. 'దైవిక జోక్యానికి లోబడి' అని కూడా ఆయన అన్నారు. ధన్‌ఖడ్ భారత ఉపరాష్ట్రపతి. ఆ రాజ్యాంగ పదవి రీత్యా ఆయన రాజ్యసభకు చైర్మన్. జూలై 21న ఆయన ఆకస్మికంగా తన పదవికి రాజీనామా చేశారు. పర్యవసానంగా రాజ్యసభ చైర్మన్ బాధ్యతల నుంచి కూడా నిష్క్రమించారు. జూలై 10, జూలై 21 మధ్య సంభవించింది జీవితాన్ని వివరించ వీలులేని విషయంగా చేసేదే సుమా! జూలై 21న పార్లమెంటు ఉభయ సభలు సాధారణంగా ప్రారంభమయ్యాయి. అంతకు ముందు రోజు ప్రభుత్వం ఆనవాయితీ ప్రకారం ఉభయ సభలలోని సమస్త పార్టీల నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సరే, అన్ని అంశాల పైన చర్చలకు, ప్రవేశపెట్టిన బిల్లుల ఆమోదం పొందేందుకు సహకరించాలని అధికారపక్షం వారు కోరడం, ప్రతిపక్షాల నేతలు సంపూర్ణంగా సహకరిస్తామని చెప్పడం జరిగింది. విచారకరమైన విషయమేమిటంటే ఒక తక్షణ ప్రాధాన్యమున్న అంశంపై సభ ఎప్పుడు, ఎలా చర్చించాలి అన్న విషయమై ప్రభుత్వ, ప్రతిపక్షాల మధ్య ప్రస్తుతం ఏకాభిప్రాయం లేదు. రాజ్యసభలో ప్రతిపక్షం సామాన్యంగా నిబంధన 267 కింద చర్చ జరగాలని పట్టుబడుతుంది. సభా కార్యక్రమాల జాబితాలోని అంశాలను వాయిదా వేసేందుకు ఉపకరించే ప్రత్యేక సాధనమే నిబంధన 267. సంబంధిత తీర్మానాన్ని 'వాయిదా తీర్మానం'గా పేర్కొంటారు. నిబంధన 267 కింద చర్చను కోరడం చెడ్డ విషయమేమీ కాదు. అయితే ఇది ప్రభుత్వాన్ని 'అభిశంసించడం'గా ఎన్డీఏ సర్కార్ పరిగణిస్తోంది (బహుశా, గతంలో కొన్ని ప్రభుత్వాలు కూడా ఇదే వైఖరి తీసుకుని ఉంటాయి). గత 11 సంవత్సరాలలో నిబంధన 267 కింద చర్చకు అధికారపక్షం చివరిసారి అంగీకరించింది నవంబర్ 2016లో 'పెద్ద నోట్ల రద్దు'పై కావడం గమనార్హం. ధన్‌ఖడ్ రాజ్యసభ చైర్మన్ అయిన తరువాత నిబంధన 267 కింద ఎప్పుడూ ఎలాంటి చర్చను అనుమతించలేదు. జూలై 21న కూడా భిన్నంగా ఏమీ జరగలేదు బీజేపీ సభ్యుడు ఒకరు నిబంధన 167 కింద పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు నోటీస్ ఇచ్చారు. పలువురు ప్రతిపక్ష సభ్యులు అదే అంశంపై చర్చకు నిబంధన 267 కింద నోటీసులు ఇచ్చారు. బీజేపీ సభ్యుడి నోటీస్‌ను సభాధ్యక్షుడు స్వీకరించారు. ప్రతిపక్ష సభ్యుల నోటీసులను తిరస్కరించారు. అవి నిర్దేశిత విధానానికి అనుగుణంగా లేవని ఎప్పుడూ చెప్పే కారణాన్నే చెప్పారు. సభలో సహజంగానే గందరగోళం ఏర్పడింది. రాజ్యసభ చైర్మన్ సభా కార్యక్రమాల సలహా సంఘం (బీఏసీ) సమావేశాన్ని మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించారు. ప్రభుత్వ ప్రతినిధులుగా జేపీ నడ్డా, కిరణ్ రిజిజు హాజరయ్యారు. కొంతసేపు చర్చ జరిగిన తరువాత ఆ సమావేశాన్ని సాయంత్రం 4.30 గంటలకు వాయిదా వేశారు. బీఏసీ మళ్లీ సమావేశమైనప్పుడు కేబినెట్ మంత్రులు ఇరువురూ హాజరు కాలేదు. చైర్మన్ ఆ సమావేశాన్ని మళ్లీ వాయిదా వేశారు. ఆ రాత్రి 9.35 గంటలకు ధన్‌ఖడ్ 'వైద్యుల సలహా' మేరకు ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. ఏ పార్టీ కానీ, ఏ ఎంపీ కానీ రాజీనామాను ఉపసంహరించుకోవాలని ధన్‌ఖడ్‌ను కోరలేదు. జూలై 22న డిప్యూటీ చైర్మన్ 'ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయింది' అని క్లుప్తంగా ప్రకటించారు. ధన్‌ఖడ్‌కు గుడ్‌బై చెప్పేందుకు అధికార పక్షం నిర్ణయించుకున్నదని స్పష్టమయింది. ఆయనకు వీడ్కోలు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం సుముఖంగా లేదు.ధన్‌ఖడ్‌కు ఎన్డీఏ ప్రభుత్వం చాలా రుణపడి ఉన్నదని చెప్పక తప్పదు. ప్రతిపక్షాలను అదుపులో ఉంచడంలో ఆయన అద్వితీయంగా వ్యవహరించారు. 'ఒకే దేశం%-%ఒకే ఎన్నిక' విషయమై ఆరెస్సెస్ / బీజేపీ వైఖరిని ఆయన పూర్తిగా సమర్థించారు. రాజ్యాంగ మున్నుడిలోని 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే పదాలను తొలగించాల్సిందేనని కూడా ధన్‌ఖడ్ డిమాండ్ చేశారు. కేశవానంద భారతి కేసులో మౌలిక నిర్మాణం సిద్ధాంతాన్ని సుప్రీంకోర్టు ప్రతిపాదించడాన్ని ఆయన విమర్శించారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాలపై న్యాయసమీక్ష సిద్ధాంతాన్ని ధన్‌ఖడ్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను నియమించే హక్కు ప్రభుత్వానికి ఉండని ఆయన సమర్థించారు. ఈ నియామకాలలో న్యాయవ్యవస్థ నిర్ణయాలకు ప్రాధాన్యముండన్న ప్రతిపాదనను ధన్‌ఖడ్ కొట్టివేశారు. చట్టసభలు ఆమోదించిన బిల్లులను మూడు నెలలలోగా ఆమోదించాలని అధికరణ 142 కింద గవర్నర్లు, రాష్ట్రపతిని సుప్రీంకోర్టు ఆదేశించడం సరికాదని ఆయన గర్హించారు. అధికరణ 105కు విరుద్ధంగా సభ్యులు తమ ప్రసంగాలలో ఉటంకించే సమాచారం, గణాంకాలను ధ్రువీకరించాలని ఆదేశించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను ఘనంగా ప్రస్తుతించారు. వివిధ అంశాలపై ఆయన వైఖరులు కరడుగట్టిన మితవాదుల అభిప్రాయాలకు అనుగుణంగా ఉండేవి. సహజంగానే అవి బీజేపీకి సంతృప్తి కలిగించే విధంగా ఉండేవి.ధన్‌ఖడ్ తన రాజకీయ జీవితంలో జనతాదళ్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని సమాజ్‌వాది జనతా పార్టీ, కాంగ్రెస్, బీజేపీలలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ధన్‌ఖడ్ నియమితుడవడంతో ఆయన రాజకీయ జీవితం పునరుత్థానమయింది. గవర్నర్‌గా ఆయన వ్యవహరించిన తీరు, మమతా బెనర్జీ ప్రభుత్వంతో కలహించడం ఆయన బీజేపీ అనుకూల వైఖరిని స్పష్టం చేశాయి. గవర్నర్ పదవి గౌరవాన్ని ఆయన ఏ విధంగానూ పెంపొందించలేదు. అయినప్పటికీ ఉపరాష్ట్రపతిగా ధన్‌ఖడ్‌కు పదోన్నతి లభించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రాజ్యసభ కార్యక్రమాలను ఆయన నిర్వహించిన తీరుకు విసిగిపోయిన ప్రతిపక్షాలు ఆయనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాయి. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవలసిన మొదటి రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడే కావడం విశేషం.

# తీరం దాటిన వాయుగుండం




- ♦ దక్షిణ కోస్తా, సీమల్లోనూ వర్షాలు
- ♦ వచ్చే వారం మరో అల్పపీడనం
- ♦ పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
- ♦ భద్రాచలం వద్ద 25.80 అడుగులు
- ♦ పోలవరం నుంచి 2.51లక్షల క్యూసెక్కులు విడుదల
- ♦ ఊపందుకున్న వరి నాట్లు,పత్తి, అపరాల సాగు

విశాఖపట్నం/అమరావతి, జూలై 26 (సందేశం టైమ్స్):తీవ్ర అల్పపీడనం శుక్రవారం ఉదయానికి వాయుగుండంగా బలపడి వాయవ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. తర్వాత రెండు, మూడు గంటల వ్యవధిలోనే పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ పరిసరాల్లో తీరం దాటింది. రానున్న 24 గంటల్లో పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా, జార?ండ్ దిశగా పయనించనుంది. వాయుగుండం ప్రభావంతో శుక్రవారం కోస్తాలో అనేకచోట్ల మేఘాలు ఆవరించాయి. ఉత్తరాంధ్రలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఉత్తర కోస్తాలోని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. వాయుగుండం ఉత్తర ఒడిశా దిశగా రానున్నందున శుక్రవారం రాత్రి ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. శనివారం ఉత్తర కోస్తాలో ఎక్కువచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఉత్తరకోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గంటకు 40-50కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా, వాయుగుండం తూర్పు భారతం మీదుగా వాయవ్య భారతం వైపు పయనించి బలహీనపడిన తరువాత వచ్చే వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలడం, వాయుగుండం ప్రభావంతో శుక్రవారం కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. అల్లూరి జిల్లా ముంచింగిపట్టులో గరిష్ఠంగా 46 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉత్తర కోస్తాలోని పలు ప్రాంతాల్లో 10 మి.మీ. కన్నా ఎక్కువ వాన పడింది. శ్రీకాకుళం నుంచి పల్నాడు జిల్లా వరకు ముసురు వాతావరణం నెలకొంది. ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 17 జిల్లాల్లో వర్షపాతం మెరుగైంది. రాయలసీమలో మాత్రం వాన లోటు కొనసాగుతోంది. ప్రస్తుత వర్షాలతో కోస్తాంధ్రలో వరి నాట్లు, పత్తి, అపరాల పంటల సాగు ఊపందుకుంది. ఇప్పటికే వేసిన ఖరీఫ్ పంటలు ఊపిరి పోసుకున్నాయని రైతులు చెబుతున్నారు.

# నీటి కేటాయింపులెప్పుడు?

### కృష్ణా బోర్డు తీరుతో ఉభయ రాష్ట్రాల నడుమ చిచ్చు



అమరావతి, జూలై 26 (సందేశం టైమ్స్): ఈ నీటి సంవత్సరంలో కృష్ణా జలాల పంపిణీపై అధికారిక నిర్ణయం తీసుకోకుండా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అలసత్వం ప్రదర్శించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపుగా రెండు నెలలుగా బోర్డు సమావేశమే కాలేదు. కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్ కేంద్ర జల సంఘం చైర్మన్‌గా నియమితులయ్యారు. బోర్డు బాధ్యతలను అదనంగా చూస్తున్నారు. కేఆర్ఎంబీకి శాశ్వత చైర్మన్‌ను ఇంకా నియమించలేదు. దీంతో నిర్ణయాలు దాదాపు నిలిచిపోయాయి. ఈ ఏడాది జూన్ 1నుంచి 2025-26 కొత్త నీటి సంవత్సరం మొదలైంది. కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకూ కేటాయించాల్సి ఉంది. రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి దాకా నీటి కేటాయింపులపై బోర్డు సమావేశాన్నే ఏర్పాటు చేయలేదు. మహారాష్ట్ర, కర్ణాటకల్లో భారీవర్షాలతో వరద తరలివస్తోంది. శ్రీశైలం డ్యాం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. రెండు రాష్ట్రాలూ జోరుగా విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నాయి. ఇప్పటికే రెండుసార్లు శ్రీశైలం గేట్లెత్తి నీటిని దిగువకు వదిలారు. సాగర్ నుంచి కూడా దిగువకు నీటిని వదులుతున్నారు. వీటిని వినియోగించడానికి రాష్ట్రం సిద్ధం కావడంతో.. ఏపీ జలదోపిడీకి పాల్పడుతోందని తెలంగాణ విమర్శలు ప్రారంభించింది. ఏపీ మాత్రం సంయమనం పాటిస్తోంది. జూన్ మూడోవారంలో నీటి కేటాయింపులపై రెండు రాష్ట్రాలతోనూ సమావేశం కావలసిన బోర్డు.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుకు కారణమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఖాతాదారుల సొమ్ము 2.86 కోట్లు హాంఫట్

### ఇచ్ఛాపురం పోస్టాఫీసులో సిబ్బంది చేతివాటం
### 14 మంది పాత్ర... ఐదుగురు సస్పెన్షన్




ఇచ్ఛాపురం, జూలై 26 (సందేశం టైమ్స్):శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం హెడ్ పోస్టాఫీసులో భారీ అవినీతి చోటు చేసుకుంది. ఖాతాదారుల యూజర్ ఐడీలు ఉపయోగించి రూ.2.86కోట్లు దారి మళ్లించారు. ఈ నెల 7న ప్రజావినతుల విభాగానికి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన పోస్టల్ అధికారులు తనిఖీకి ఆదేశించారు. పోస్టల్ ప్రాంతీయ తనిఖీ అధికారులు ఎన్.శ్రీకాంత్, కమల్‌హాసన్ ఇచ్ఛాపురం వచ్చి, విచారణ జరిపారు. బాధితులతోనూ మాట్లాడారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. 'ఇచ్ఛాపురం కేంద్రంగా తపాలాశాఖలో భారీ అవినీతి జరిగింది. ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేశాం. ఇచ్ఛాపురం హెడ్ పోస్టాఫీసులో 33మంది ఖాతాదారుల నుంచి రూ.2.86 కోట్లు మళ్లించినట్లు గుర్తించాం. ఇందులో 14 మంది సిబ్బంది పాత్ర ఉన్నట్టు గుర్తించాం. ప్రస్తుతం ఐదుగురిని సస్పెండ్ చేశాము. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని తెలిపారు.పోస్టాఫీసు ఖాతాదారుల యూజర్ ఐడీ పోస్టల్ సబ్ డివిజన్‌లో 14మంది అధికారుల వద్దే ఉంటుంది. వారిలో ఎవరో ఒకరు సైబర్ నేరస్థుడితో చేతులు కలపడం ద్వారానే స్కాం జరిగే అవకాశం ఉంది. యూజర్ ఐడీలు ఉపయోగించి రూ.2.86 కోట్లు ఆన్‌లైన్ ద్వారా ఇతర ఖాతాలకు పంపించినట్లు తెలుస్తోంది. ఇందుకు బాధ్యులను చేస్తూ ఐదుగురు పోస్టల్ ఉద్యోగులపై ఉన్నతాధికారులు వేటు వేశారు. దీంతో ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది.

## ద్విచక్రవాహనదారుడిపై చిరుత దాడి



ఇంటర్నెట్ డెస్క్:జూలై 26 (సందేశం టైమ్స్):తిరుపతిలో అలిపిరి జూపార్క్ రోడ్డులో ఓ చిరుత ద్విచక్ర వాహనదారుడిపై దాడికి యత్నించింది. రాత్రి 7.30 గంటల సమయంలో క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో పొదల చాటున ఉన్న చిరుత ఒక్కసారిగా దూసుకువచ్చింది. అదృష్టవశాత్తు బైక్‌పై వేగంగా వెళ్తుండటంతో అతడు త్రుటిలో తప్పించుకోగలిగాడు.

# తాడేపల్లి గ్యాంగ్ రేప్ కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు



గుంటూరు(లీగల్), జూలై 26 (సందేశం టైమ్స్):తాడేపల్లి గ్యాంగ్ రేప్ కేసులో రెండో ముద్దాయి సీరు కృష్ణ కిశోర్‌కు 20ఏళ్ల జైలుశిక్ష, రూ.62వేల జరిమానా విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ తీర్పు చెప్పారు. మాజీ సీఎం జగన్ ఇంటికి కూతవేటు దూరంలో జరిగిన ఈ ఘటన పెద్ద దుమారాన్ని రేపింది. ఈ కేసులో మొదటి ముద్దాయి ఇప్పటికీ పరారీలో ఉండడం గమనార్హం. వివరాలివీ.. విజయవాడ ఆస్పత్రిలో పనిచేసే ఓ నర్స్ రాత్రి డ్యూటీ ముగించుకొని 2021 జూన్ 19న రాత్రి 9 గంటల ప్రాంతంలో తన మిత్రుడితో కలిసి బైక్‌పై తాడేపల్లి సీతానగరం ఘాట్‌కు వచ్చి ఇసుక తిన్నెలపై కాసేపు గడిపారు. అక్కడ వారిని ప్రకాశం జిల్లా చిన్నగంజాంకు చెందిన(తాడేపల్లిలో నివాసం) రామలింగం ప్రసన్నరెడ్డి, సీరు కృష్ణ కిశోర్ బెదిరించి.. ఆమె మిత్రుడి కాళ్లూ చేతులు కట్టేశారు. ఆ యువతిపై సామూహిక అత్యాచారం చేశారు. 2021 ఆగస్టు 7న ఈ కేసులో రెండో నిందితుడైన కృష్ణ కిశోర్‌ను పోలీసులు అరెస్టు చేయగా విచారణలో ఈ నేరంతో పాటు.. తాను, ప్రసన్నరెడ్డితో కలిసి ఎడ్లపల్లి ఆనందకుమార్ అనే వ్యక్తిని హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ప్రసన్న రెడ్డి పరారీలో ఉన్నట్లు పోలీసులు చూపగా కోర్టులో కృష్ణకిశోర్‌పైనే విచారణ సాగింది. కాగా, తుది తీర్పులో.. నిందితుడికి వేసిన జరిమానా రూ.62వేలు బాధితురాలికి చెల్లించాలని, దీనితో పాటు అదనంగా మరో రూ.లక్ష ప్రభుత్వం నుంచి ఆమెకు అందేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను కోర్టు ఆదేశించింది.

# సీఎం సహాయ నిధి పంపిణీ



రాజంపేటజూలై 26 (సందేశం టైమ్స్):తీవ్ర అనారోగ్యానికి గురైన వారికి సీఎం సహాయనిధి చెక్కులను అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ పంపిణీ చేశారు. బీము గోపాల్‌రెడ్డి, సింగరాజు జ్ఞానకీర్తనలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మాజీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, తాను కలిసి రాజంపేట పార్లమెంట్ పరిధిలో అనారోగ్యంపాలైన వారి వివరాలను సీఎంకు అందజేయగా సుమారు ఏడుగురికి సీఎం సహాయనిధి చెక్కులు అందించార న్నారు. బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సునీతానారాయణ, తోట శ్రీనివాసులు, పట్టణ బీజేపీ అధ్యక్షులు వీవీ రమణ, రూరల్ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



ముద్దనూరు(కడప) :జూలై 26 (సందేశం టైమ్స్): ముద్దనూరు-కొండాపురం వెళ్లే రైలు మార్గంలో శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. మృతుడు తెల్ల ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్ నా సక్సెస్ ఫార్ములా : విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి

ఎంవిపి కాలనీ(విశాఖ):జూలై 26 (సందేశం టైమ్స్):నా జీవితంలో ఓ సంఘటన డాక్టర్ గా ఉన్న నన్ను పోలీసు అధికారిగా మార్చేసింది. 1990 దశకంలో పశ్చిమ బెంగాల్లో ఓ పోలీస్ స్టేషన్ వద్ద ఓ సామాన్య కుటుంబం ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితుల్ని కళ్లారా చూసిన నేను తీవ్రంగా చెల్లించి పోయాను. ఆ పేద కుటుంబం తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుంటే వినే పోలీసే లేకుండా పోయాడు. ఆ సంఘటన నా మదిలో బలంగా నాటుకుపోయింది. అప్పుడే నేను పోలీసు అధికారిగా మారాలని గట్టి నిర్ణయం తీసుకున్నాను. ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) ని పబ్లిక్ సర్వీస్ గా మార్చాలని నిర్ణయించుకున్నాను. ఆ బలమైన కోరికే నన్ను పోలీసు అధికారిగా మార్చింది అని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. శుక్రవారం ఉదయం విశాఖపట్నం క్రైమ్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సిపితో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ఆయన ఎన్నో ఆసక్తికరమైన విషయాలను మీడియాతో పంచుకున్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం పోలీసులంటే ఎంతో క్రూరమైన వ్యక్తులని జనంలో ఒక అభిప్రాయం ఉండేదని, ఆ అభిప్రాయం కాస్త క్రమేపీ మారుతూ వస్తోందన్నారు. ఫెండ్లీ పోలీసింగ్ ద్వారా ఎన్నో సత్ఫలితాలు సాధించవచ్చని తన కెరియర్లో ఎన్నోసార్లు నిరూపితమయ్యాయని ఆయన స్పష్టం చేశారు. అందుకే ఏ జిల్లాలో, ఏ క్యాడర్లో పనిచేసినా పౌర సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు తొలి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. దీంట్లో భాగంగానే తన ఫోన్ నంబర్ ను ప్రజలకు తెలియజేస్తూ ఏ సమయంలో ఏ కష్టం వచ్చినా నేరుగా ఫోన్ ద్వారా గాని, వాట్సాప్ మెసేజ్ రూపంలో గానీ తెలియజేయమని కోరుతున్నానని చెప్పారు.




విశాఖ నగర పోలీస్ కమిషనర్ గా గడిచిన ఏడాది కాలంలో నా ఈ ప్రయత్నం ఎంతోమందికి చేరువైందని, పోలీసు శాఖ పట్ల విశ్వసనీయతను పెంచిందని సిపి వెల్లడించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, సైబర్ నేరాల నియంత్రణకు ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో నైట్ లైఫ్ కల్చర్ పెరుగుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని పర్యాటకంగా విస్తరిస్తున్న నగరంలో నైట్ పోలీసింగ్ కూడా పటిష్టంగా చేపడుతున్నామని సిపి చెప్పారు.

# రేషన్ బియ్యం లారీ బోల్తా..



మక్కువ(మన్యం)జూలై 26 (సందేశం టైమ్స్):మక్కువ మండల కేంద్రానికి రేషన్ బియ్యం తీసుకు వస్తున్న లారీ శనివారం మక్కువ-బొబ్బిలి రహదారి మధ్యలో బోల్తా పడింది. నరసింహన్నపేట సమీపంలో ఉన్న పామ్ ఆయిల్ కాట సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాద వార్త తెలుసుకున్న అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# పెంచిన తండ్రిని చంపినందుకు జీవితఖైదు



పిడుగురాళ్ల జూలై 26 (సందేశం టైమ్స్):పెంచిన తండ్రిని హత్య చేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదు, పెంచిన తల్లిపై దాడి చేసినందుకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ గురజాల పదో అదనపు కోర్టు జడ్జి శరత్‌బాబు తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి అయిన మచ్చు యోహాను (71)కు పిల్లలు లేకపోవడంతో అతని తమ్ముడు కుమారుడైన అంబేద్కర్‌ను చిన్నప్పటి నుండి పెంచుకుంటూ పెళ్లి సైతం చేశాడు. అయితే చోరీలు, ఇతర చెడు పనులకు అలవాటు పడిన అంబేద్కర్ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో అంబేద్కర్ మరో సోదరునికి యోహాను దగ్గరవుతుండడంతో ఆస్తి మొత్తాన్ని అతనికి రాసిస్తాడేమోనని యోహానుపై అంబేద్కర్ కక్ష పెంచుకున్నాడు. యోహానును హతమారిస్తే ఆస్తి తనదవుతుందని భావించి హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. గతేడాది ఫిబ్రవరి 21న పిడుగురాళ్ళ పట్టణంలోని గాంధీ నగర్ రెండోలైన్‌లో ఉండే యోహానుపై కత్తితో దాడి చేసి హతమార్చాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన యోహాను భార్య చిట్టెమ్మపైనా దాడిచేసి పరారయ్యాడు. ఈ కేసులో నిందితుణ్ణి అప్పటి పట్టణ సిఐగా ఉన్న వీరాంజనేయులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రస్తుత గురజాల డీఎస్పీగా జగదీష్, పట్టణ సిఐ వెంకటరావు కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను కోర్టుకు అందించారు. ప్రాసిక్యూషన్ తరుపున కె.సూర్యరాజు వాదించారు. నేరం రుజువు కావడంతో జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

# ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి



సంతనూతలపాడు :జూలై 26 (సందేశం టైమ్స్):విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ సలహాదారులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు చిగురుపాటి చిన్నాజి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేటీసీ పాపారాయుడు, విద్యా కమిటీ కన్వీనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు తమ గోల్ సెట్టింగ్ ఎలా చేసుకోవాలి, భవిష్యత్తులో మంచి మార్పుతో స్మార్ట్‌గా ఎలా చదవాలి అనే అంశాలపై వారు వివరించారు. అలాగే కూల్‌డ్రింక్ తాగటం వల్ల కలిగే అనర్థాల గురించి, వివిధ మార్కెట్లో దొరికే తినుబండారాలు వాటి దుష్పరిణామాల గురించి వివరించారు. విద్యార్థులు వైపు నుంచి కూడా చక్కటి స్పందన వచ్చింది. వారు డయాస్ మీదకు వచ్చి మాట్లాడి ఈ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక కార్యక్రమాలు తమ పాఠశాలలో ఏర్పాటు చేయాలని విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులు పార్వతి శాంతి, ఉపాధ్యాయులు కోరారు.

# 3న కెవిపిఎస్ జిల్లా మహాసభ

మంగళగిరిజూలై 26 (సందేశం టైమ్స్):రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు హిందూ ముస్లిముల మధ్య ఘర్షణలు పెట్టేలా ఉందని, చరిత్రలో లేని దానిని ఉన్నట్లుగా తీసిన ఈ సినిమాను రద్దు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. కూటమి పాలనలో దళితులపై, ముస్లిములపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. మంగళగిరికి వచ్చిన ఆయన స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ బిజెపి పాలన సాగుతోందని, ముస్లిములు, దళితులు, గిరిజనులపై దాడులు విపరీతంగా




పెరిగిపోతున్నాయని అన్నారు. అదే ధోరణి ఆంధ్రప్రదేశ్‌లోనూ కనిపిస్తోందని చెప్పారు. నూతన విద్యావిధానం అమలు వల్ల ప్రకాశం జిల్లాలో 15 ప్రభుత్వ పాఠశాలల మూతపడ్డాయని, వీటిల్లో 13 పాఠశాలలు దళిత ప్రాంతాలకు చెందినవేనని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను దెబ్బతీసి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు ఉపయోగపడేలా ఉన్న ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్‌లో రిజర్వేషన్లు అమలు చేయడం లేదని, రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వచ్చేనెల 3వ తేదీన కెవిపిఎస్ గుంటూరు జిల్లా 6వ మహాసభ మంగళగిరిలో జరుగుతున్న సందర్భంగా 'కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు %-% సామాజిక న్యాయం' అంశంపై సదస్సు నిర్వహిస్తామని, దళిత్ సోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శ్యామల ఆనందకుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ హాజరవుతారని తెలిపారు.

# రెండు రోజుల్లో గేట్లు ఎత్తే అవకాశం



విజయపురిసౌత్ :జూలై 26 (సందేశం టైమ్స్):నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి భారీగా వరద వచ్చి చేరుతుండ టంతో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సాగర్‌కు 121400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో రిజర్వాయర్ నీటిమట్టం వేగంగా పెరుగుతూ నిండుకుండను తలపిస్తోంది. ఈ క్రమంలో ప్రాజెక్ట్ అధికారులు ఆదివారం గేట్లు ఎత్తెందుకు సన్నాహాలు చేస్తున్నారు.సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 కాగా సాయంత్రానికి 579 అడుగులు వద్ద ఉంది. ఇది 280.1200 టీఎంసీల సమానం. కుడి కాల్వ ద్వారా 511 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 3972 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ఎఎంఆర్‌పి ద్వారా 1800 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేందం నుంచి ఎటువంటి విద్యుత్ ఉత్పత్తి జరగటం లేదు. ప్రస్తుతం సాగర్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా 121400 క్యూసెక్కులు వస్తుండడంతో 6283 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

# భార్యపై అనుమానంతో ఫీల్డ్ అసిస్టెంట్ ఇంటికి నిప్పు



రేణిగుంట జూలై 26 (సందేశం టైమ్స్):భార్యపై అనుమానంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను హత్య చేయాలని భావించాడు. బంధువులతో కలిసి తెల్లవారుజామున దొడ్లమిట్టలోని అతడి ఇంటికి నిప్పు పెట్టారు. ఇంట్లో ఉన్న నవీన్ అప్రమత్తం కావడంతో బయటపడ్డారు. సీఐ జయచంద్ర తెలిపిన ప్రకారం.. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్టలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద స్థానికంగా 200 మంది కూలీలు పని చేస్తున్నారు. వీరిలో ఒక మహిళతో నవీన్‌కు వివాహేతర సంబంధం ఉందని ఆమె భర్తకు అనుమానం. దీంతో అతడు నవీన్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున 2 గంటలకు తన అన్న, అక్కతో కలిసి ఆ మహిళ భర్త రామాంజనేయులు.. నవీన్‌ను సజీవంగా దహనం చేసేందుకు అతడి ఇంటి చుట్టూ పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఇంటికి మంటలు అంటుకోవడంతో నిద్రలో ఉన్న నవీన్ తేరుకొని బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఏసీ, ఇంట్లోని ముఖ్యమైన పరికరాలు కాలిపోగా, 70 శాతం ఇల్లు దగ్ధమైందని సీఐ తెలిపారు. బాధితుడు నవీన్ ఫిర్యాదు మేరకు రామాంజనేయులు, ఆదినారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# రూ.1.29 కోట్ల బంగారం, వజ్రాలతో ఇద్దరి అరెస్టు




జూలై 26 (సందేశం టైమ్స్):సుమారు రూ. 1.29 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాల (డైమండ్స్)తో పరారైన ఓ డైమండ్ షోరూమ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌తో పాటు మరొకరిని అరెస్టు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి తెలిపారు. కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన ముదపాక జేజి (49) హైదరాబాద్‌కు చెందిన క్రిష్ డైమండ్ షోరూమ్‌లో ఆరు నెలల క్రితం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. షోరూమ్‌లోని డైమండ్, బంగారు ఆభరణాల మోడల్స్‌ను విశాఖలోని వివిధ గోల్డ్ షోరూమ్‌లలో చూపించేందుకు అదే సంస్థలో పనిచేస్తున్న బొగ్గు వంశీ అనే మరో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌తో కలసి ఈ నెల మూడో తేదీన విశాఖపట్నం వచ్చారు. ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న హోటల్‌లో గది తీసుకొని ఇద్దరూ బస చేశారు. ఆరోజు వివిధ షోరూమ్‌లలో ఆభరణాల మోడల్స్ చూపించి తిరిగి తీసుకువచ్చారు. మరుసటిరోజు తెల్లవారుజామున సుమారు ఐదు గంటల సమయంలో తనతో పాటు వచ్చిన వంశీ నిద్రిస్తున్న సమయంలో ముదపాక జేజి ఆభరణాల బ్యాగ్‌తో పరారయ్యాడు. నిద్ర నుంచి లేచి చూసిన వంశీకి జేజితో పాటు ఆభరణాల బ్యాగ్ కనిపించలేదు. సీసీ ఫుటేజీలు పరిశీలించి బ్యాగ్‌తో పరారైనట్టు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు బ్యాగ్‌తో కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీచేశారు. ఆభరణాలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒకరు ముదపాక జేజి కాగా మరొకరి పేరు ఆకుల సత్యనారాయణ. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.1,29,48,154 విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు కమిషనర్ బాగ్చి పేర్కొన్నారు.

# గంజాయిపై ఉక్కుపాదం



జూలై 26 (సందేశం టైమ్స్):నగరంలోకి గంజాయి రాకుండా అడ్డుకట్ట వేయడంపై పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ దృష్టిసారించారు. అందుకోసం శివారు ప్రాంతాలతో పాటు సిటీలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేయించారు. అక్కడ నిరంతర తనిఖీలు నిర్వహించేలా మూడు షిఫ్టుల్లో (ముగ్గురు నుంచి నలుగురు) సిబ్బందిని నియమించారు. ఒకవేళ వారి నుంచి ఎవరైనా తప్పించుకున్నా వెంటపడి పట్టుకునేలా రెండు ప్రత్యేక లార్కింగ్ (మొబైల్) చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. నగరంలో గంజాయి వినియోగం పెరిగిపోయింది. ఆ మత్తులో కొందరు దాడులు, హత్యలు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దీనివల్ల నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది. నగరంలో గంజాయి దొరకుండా చేయగలిగితే నేరాలు గణనీయంగా తగ్గుతాయని సీపీ భావిస్తున్నారు. ఏజెన్సీతోపాటు ఒడిశా నుంచి నగరానికి గంజాయి చేరుతున్నందున ఆయా మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలనే నిర్ణయించారు. వాహనాలను నగర శివార్లలో ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేయగలిగితే 80 శాతం గంజాయిని నగరంలోకి రాకుండా నియంత్రించవచ్చునని అంచనా వేశారు. అనుకున్నదే తడవుగా నగరశివారు ప్రాంతాలైన ఆనందపురం, భీమిలి వద్ద ఉన్న చెక్‌పోస్టులను బలోపేతం చేయడంతోపాటు కొత్తగా మరికొన్ని చెక్‌పోస్టలను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని గుర్తించి వెంటనే వాటిని ప్రారంభించారు. అరకు వైపు నుంచి నగరంలోకి గంజాయి రవాణా జరుగుతున్నందున పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో సరిపల్లి వద్ద చెక్‌పోస్టను ఏర్పాటుచేశారు. అలాగే పాడేరు నుంచి సబ్బవరం మీదుగా నగరంలోకి గంజాయి రవాణా అవుతుండడంతో పినగాడి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటుచేశారు. కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంటు, ఆనందపురం, తగరపువలస, రైల్వేస్టేషన్, ద్వారకా బస్‌స్టేషన్ వద్ద చెక్‌పోస్టలను ఏర్పాటుచేశారు. ప్రతి చెక్‌పోస్ట్ వద్ద ముగ్గురు లేదా నలుగురు సిబ్బంది ఉంటూ అన్ని ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, కార్లు, వ్యాన్‌లు, బైక్‌లతోపాటు అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఒకవేళ అక్కడ పోలీసులను చూసి ఎవరైనా వాహనం ఆపకుండా ముందుకువెళ్లిపోతే వారిని పట్టుకునేందుకు వీలుగా రెండు ప్రత్యేక లార్కింగ్ (మొబైల్) చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద మూడు షిఫ్టుల్లో నిరంతరం పనిచేసేలా సిబ్బందిని నియమించారు. దీంతో నగరంలోకి గంజాయి రవాణా తగ్గుతుందని ఆశిస్తున్నట్టు సీపీ శంఖబ్రతబాగ్చి వివరించారు. గంజాయి రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు మరికొన్ని చెక్‌పోస్టులను కూడా ఏర్పాటుచేసే ఆలోచన ఉందని, సిబ్బంది కొరత కారణంగా ప్రస్తుతానికి వేచిచూస్తున్నామన్నారు.

# మధ్యాహ్న భోజనంలో అవకతవకలు

## మార్కాపురంలోని జడ్పీ బాలికల హైస్కూల్ డైరెక్టర్ ఆగ్రహం హెచ్ఎంపై చర్యలకు ఆదేశం



ఒంగోలు విద్య జూలై 26 (సందేశం టైమ్స్): మార్కాపురం జిల్లా పరి షత్ బాలికల హైస్కూలులో మధ్యాహ్న భోజనం అమలులో అవకతవ కలు చోటుచేసుకోవడంపై రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ అగ్ర హం వ్యక్తం చేశారు. బాధ్యులైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీని కోరుతూ ఉత్తర్వులు జారీచేశారు. మార్కాపురం జడ్పీ బాలికల హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకం అమలులో అవకతవకలు చోటుచేసుకున్నాయి. వీటిని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వెలుగులోకి తేవడంతో అక్కడి సబ్ కలెక్టర్, ఉప విద్యాధికారి, మండల విద్యాధికారి పాఠశాలలను సందర్శించి విచారణ నిర్వహించారు. అందు లో నివ్వెరపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.. రోజూ హైస్కూలులో 800 మంది విద్యార్థినులు మధ్యాహ్న భోజనం చేస్తారు. వీరికి ఒక్కొక్కరికి రోజుకు 150 గ్రాముల చొప్పున బియ్యం ఇవ్వాల్సి ఉండగా మొత్తం 70 నుంచి 80 కేజీలు మాత్రమే హెచ్ఎం ఇస్తున్నారు. ప్రతి విద్యార్థికీ ఒక గుడ్డు చొప్పున 800 గుడ్లను ఇవ్వాల్సి ఉండగా కేవలం 400 గుడ్లు మాత్రమే ఇస్తున్నారు. విద్యార్థినులకు ఇవ్వాల్సిన చిక్కీలలో కూడా కోత పెట్టారు. పాఠశాలలో బియ్యం నిల్వల్లో కూడా భారీగా తేడాలు ఉన్నాయి. మధ్యాహ్నం భోజన స్టాక్ రిజిస్టర్ ప్రకారం 2510.50 కేజీల బియ్యం నిల్వ ఉండాల్సి ఉండగా 3,725 కేజీలు ఉన్నాయి. రిజిస్టర్‌లో 238 గుడ్లు నిల్వ ఉన్నట్లు పేర్కొనగా అక్కడ 70 ఉంటాన్ని గుర్తించారు. చిక్కీలు కూడా 986కి గాను అదనంగా 889 ఉన్నాయి. మధ్యాహ్న భోజనంకు సంబంధించిన స్టాక్ బియ్యం, గుడ్లు, చిక్కీలు విక్రయించగా వచ్చిన రూ.2 లక్షలను తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేశారు. మధ్యాహ్న భోజన బియ్యం స్టాక్ విక్రయించినట్లు హెచ్ఎం స్వల్పంగా అంగీకరించినందున సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆర్జేడీకి డైరెక్టర్ లేఖ రాశారు. హెచ్ఎం విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై డైరెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మధ్యాహ్నం భోజనంలో అవకతవకలు, అక్రమాలు ఈనెల 14న వెలుగులోకి రాగా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ లేవు.

# వాలిడేషన్ చట్టాన్ని రద్దుచేయాలి

## పుష్కరాల రేవు వద్ద నిరసన చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు రాజమహేంద్రవరంలో పెన్షనర్ల నిరసన




రాజమహేంద్రవరం సిటీ,జూలై 26 (సందేశం టైమ్స్): వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేసి అందరికీ ఒకేలా పే కమిషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల అసో సియేషన్ నిరసన నిర్వహించింది. రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం వాలిడేషన్ ఆఫ్ సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (పెన్షన్) రూల్స్ ప్రిన్సిపుల్స్ ఫర్ ఎక్స్‌పన్జిచర్ ఆఫ్ పెన్షన్స్ పేరుతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 309ను అనుసరించి 2023లో కొన్ని మార్పు లను చేస్తూ 2025లో పార్లమెంట్‌లో ఆమోదించారని దీని వల్ల పెన్షనర్లు కమిషన్ అమలుకు ముందు రిటైరైన వాళ్లు, అమలు తర్వాత రిటైరైన వాళ్లు అని విభజింపబడ్డారని తెలిపారు. ఫలితంగా పే కమిషన్‌కు ముందు రిటైరైన ఉద్యోగులకు గతంలో మాదిరిగా పెన్షన్ రివిజన్ అడిగే హక్కు కోల్పోతారని, పాత పెన్షన్ మీదే శేషజీవితం గడపాల్సి వస్తుందన్నారు. ఎప్పటికీ వారి పెన్షన్‌లో డీఏలు తప్ప ఇతరాత్ర పె రుగుదల ఉండదన్నారు. రెండు వర్గాలుగా విభజించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. శివ కమిషన్ ప్రతిపాదనలను పెన్షనర్లందరికీ ఒకేలా అమలు చేయాలని, 8వ వేతన సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు కె.భాస్కరరావు, బీఎస్ఎన్ఎల్ తరపున ఆర్ఎస్ ఎన్ మూర్తి, కె.సన్యాసిరావు, ఏవీవీ సత్యనారాయణ, పోస్టల్ తరపున డి.తిరుపతిరావు, ఎంవీ రత్నం, సీహెచ్ ధర్మరాజు, ఎస్ ఎన్పీఏడబ్ల్యూఏ నుంచి ఎస్ఎస్ఎన్ రెడ్డి, కేఎస్ ఎన్ రాజు, చిక్కాల వెంకటరావు పాల్గొన్నారు.

## ఈ నెల 28న కేబినెట్ భేటీ..
## సిగాచీ ప్రమాద నివేదికపై చర్చ..



హైదరాబాద్:జూలై 26 (సందేశం టైమ్స్): సోమవారం తెలంగాణ కేబినెట్ మరోసారి భేటీ కానుంది. పాశమైలారం సిగాచీ ప్రమాదంపై నిపుణుల కమిటీ ఇచ్చిన రిపోర్టుపై ప్రభుత్వం ఈ సమావేశంలో కీలక చర్చలు జరపనుంది. కమిటీ సూచనలపై చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. కాగా, సిగాచీ దుర్ఘటనపై రెండు రోజుల క్రితమే సీఎస్‌కు నిపుణుల కమిటీ నివేదిక సమర్పించింది. సిగాచీ కంపెనీ సరైన రక్షణా చర్యలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్పష్టం చేసింది. ఈ నివేదికలో పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై పలు కీలక సూచనలు చేసింది.

అగ్ని ప్రమాదాల విషయంలో సిగాచీ కంపెనీ ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించలేదని నిపుణుల కమిటీ నివేదికలో వెల్లడించింది. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేసింది. పరిశ్రమల్లో విపత్తు నివారణకు రాష్ట్రవ్యాప్తంగా ఇండస్ట్రియల్ మేనేజ్మెంట్ అథారిటీని ఏర్పాటు చేయడం అత్యవసరమని సూచించింది. ఈ అథారిటీ పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షించాలని పేర్కొంది.

## మా ఇంటికి ఫోన్ చేయండన్నా..
## ప్రాణాలు పోయే ముందు బీటెక్ విద్యార్థిని వేడుకోలు..




జూలై 26 (సందేశం టైమ్స్):అన్నా మా ఇంటికి ఫోన్ చేయండన్నా.. నన్ను కాపాడండి అన్నా.. ఇవి ప్రాణాలు పోయే ముందు బీటెక్ విద్యార్థిని ఆర్తనాదాలు. రోడ్డు ప్రమాదంలో లారీ టైర్ల మధ్యలో ఇరుక్కున్న ఆ యువతి.. నొప్పి భరించలేక విలవిల్లాడిపోయింది. తన కళ్ల ముందే తండ్రి మరణాన్ని చూసిన ఆమె.. కాసేపటికి తానూ తనువు చాలించింది. ఈ ఘటన అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళు ప్రాణాలు కోల్పోయారు.రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ చౌరస్తాలో శనివారం ఉదయం ఘోర ప్రమాదం చోట చేసుకుంది. కూతురికి కాలేజీకి టైం అవుతోంది. సమయానికి అందుబాటులో ఉన్న తండ్రి.. కూతురిని బైకుపై ఎక్కించుకుని బయలుదేరాడు. గమ్యస్థానికి చేరుకునేలోపే వారిపై విధి కన్నెర్ర చేసింది. దీంతో కాసేపట్లో కాలేజీ క్లాస్‌రూంలో అడుగుపెట్టాల్సిన యువతి.. తిరిగిరానిలోకాలకు చేరుకుంది.%షాద్‌నగర్‌కు చెందిన మచ్చేందర్ అనే వ్యక్తి.. బీటెక్ చదువుతున్న తన కూతురు మైత్రిని బైకుపై ఎక్కించుకుని కాలేజీకి బయలుదేరాడు. షాద్‌నగర్ చౌరస్తా వద్దకు రాగానే వీరి బైకునుట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన మచ్చేందర్.. అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కూతురు మైత్రి లారీ టైర్ల మధ్యలో ఇరుక్కుపోయింది. తీవ్రగాయాలపాలైన ఆమె.. బయటికి రాలేక విలవిల్లాడిపోయింది. చుట్టూ గుమికూడిన వారిని చూసి.. కాపాడండి.. అన్నా.. అంటూ కేకలు పెట్టింది.ప్రాణాలు పోయే స్థితిలో ఉన్న ఆమె.. ఎలాగోలా తన ఫోన్ బయటికి తీసి అక్కడున్న వారికి ఇచ్చింది. మా ఇంటికి ఫోన్ చేయండి అన్నా.. అని కోరింది. ఇంతలో ఆమె ఫోన్‌కు ఫోన్లు రావడంతో స్థానికులు విషయం తెలియజేశారు. అయితే ఇంతలోనే మైత్రి కూడా తనువు చాలించింది. ప్రాణాలు పోయే ముందు ఆమె ఆర్తనాదాలు విని అంతా కంటతడి పెట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాలను స్వాధీనం చేసుకుని షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో మృతుల స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## దంచికొట్టిన వాన..
## రహదారులు జలమయం



హైదరాబాద్ సిటీ:జూలై 26 (సందేశం టైమ్స్): నగరంలోఉదయం నుంచీ చిరుజల్లులు పడుతుండగా, రాత్రి గంటపాటు దంచికొట్టింది. 8.30 తర్వాత గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ పంజాగుట్ట, మెహిదీపట్నం, లంగర్‌హౌస్, షేక్‌పేట, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. భారీగా ట్రాఫిక్ జాం సమస్యలు తలెత్తాయి.రాత్రి 10 గంటల వరకు యూసుఫ్‌గూడ, గోల్కొండలలో 2.5సెం.మీల వర్షపాతం నమోదైంది. బోరబండ, హైటెక్‌సిటీ, ఖైరతాబాద్, మారేడ్‌పల్లి, ఉప్పల్, షేక్‌పేట ముషీరాబాద్, సికింద్రాబాద్ తో పాటు పలు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో రహదారులు జలమయంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.%ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మ్యాన్‌హోళ్లు పొంగి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కాగా, హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాలకు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భారీగా వరద నీరు చేరుతుండడంతో వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి జలాశయాలను అధికారులతో కలిసి సందర్శించారు. పరీవాహక ప్రాంతాలలో గస్తీ పెంచాలని, సీసీ కెమెరాలతో నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

## హెచ్‌సీఏ స్కామ్‌లో మరొకరు అరెస్ట్




హైదరాబాద్, జూలై 26 (సందేశం టైమ్స్): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దేవరాజ్‌ను తెలంగాణ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని పుణెలో దేవరాజును అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని హైదరాబాద్ తీసుకువచ్చి.. మల్కాజ్‌గిరి కోర్టులో హాజరుపరిచారు. అయితే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌పై కేసు నమోదైన.. దాదాపు 17 రోజుల అనంతరం సీఐడీ పోలీసులకు దేవరాజు చిక్కారు. ఈ 17 రోజుల్లో దాదాపు 7 రాష్ట్రాల్లో దేవరాజు పర్యటించినట్లు ఈ సందర్భంగా పోలీసులు గుర్తించారు.అయితే దేవరాజును గాలించేందుకు 6 ప్రత్యేక బృందాలను సీఐడీ అధికారులు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో కుంభకోణం వెలుగులోకి రాగానే.. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ సమాచారంతో సీఐడీ నుంచి దేవరాజు తప్పించుకున్న విషయం విదితమే. దీంతో ఆయనను పట్టుకునేందుకు సీఐడీ బృందాలు.. ఈ 17 రోజుల్లో 7 రాష్ట్రాలు తిరిగాయి. చివరకు పుణెలో దేవరాజును అదుపులోకి తీసుకున్నారు. సీఐడీ అధికారులు దాదాపు 36 గంటల పాటు నిర్విరామంగా పని చేసి.. పుణెలో దేవరాజును అరెస్ట్ చేశారు. సీఐడీ నుంచి దేవరాజు తప్పించుకున్న తర్వాత.. హైదరాబాద్, భద్రాచలం, కాకినాడ, వైజాగ్, తిరుపతి, నెల్లూరు, చెన్నై, కాంచీపురం, బెంగళూరు, గోవా, పుణె, ఊటీ, యానాం తదితర ప్రదేశాల్లో దేవరాజు పర్యటించినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. ఇతర రాష్ట్రాల పోలీసుల సమన్వయంతో సీఐడీ అధికారులు దేవరాజును పట్టుకున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కుంభకోణంలో దేవరాజు ఏ2గా ఉన్న సంగతి తెలిసిందే.

## నీటిని నిల్వ లేకుండా పరిసరాలను శుభ్రం చేసుకోవాలి..
## రామగుండం డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి



కోల్ సిటీ, జూలై 26 (సందేశం టైమ్స్):పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి సూచించారు. నగరంలోని పలు డివిజన్లలో డ్రైడే ఫ్రైడే నిర్వహించి గోలాలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. వెంకట్రావుపల్లిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన స్థానికులతో మాట్లాడారు. నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు.దోమ కాటు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పల్లె దవాఖాన సందర్శించి జ్వర పీడితుల వివరాలు సేకరించారు. జ్వర పీడితులు ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి నసూచించారు. అలాగే పలు డివిజన్లలో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయించి ఫాగింగ్ చేశారు. టేలాండ్ ప్రాంతాల్లో తాగునీటికి క్లోరిన్ పరీక్షలు చేశారు. స్థానిక బస్టాండ్ ఏరియా పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాలలో శానిటరీ ఇన్స్పెక్టర్లు నాగభూషణం, కిరణ్, మెప్మా సీడీ ఊర్మిళ, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, వార్డు అధికారులు, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ క్యాంటీన్లలో ఆగస్టు 15 నుంచి అల్పాహారం




హైదరాబాద్ సిటీ:జూలై 26 (సందేశం టైమ్స్): ఇందిరమ్మ క్యాంటీన్లలో రూ.5కే అల్పాహారం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు వేగవంతం చేసింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15వ తేదీ నుంచి ఉదయం టిఫిన్ వడ్డించాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. రూ.5భోజన కేంద్రాల్లోనే అల్పాహారం అందుబాటులో ఉండనుంది. క్యాంటీన్ నమూనానూ బల్దియా మారుస్తోంది. 40/10, 20/10 పరిమాణాలతో నూతన కేంద్రాలను డిజైన్ చేసింది. ఎక్కువ విస్తీర్ణం ఉంటే వడ్డించేందుకు అనువుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో ఇప్పటికే ఇందిరమ్మ క్యాంటీన్ నూతన నమూనా ఏర్పాటు పూర్తయ్యింది.

## ఇందిరమ్మ ఇండ్ల పేరుతో..
## పేదలను దగా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్



గుర్రంపోడ్,జూలై 26 (సందేశం టైమ్స్):ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పేద ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసగిస్తోందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. మండలంలోని చామలేడు గ్రామంలో అర్హులై ఉండీ ఇండ్లు మంజూరు కాని గుడిసెలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇండ్లు మంజూరు కాని వారి జాబితాతో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నాగులవంచ తిరుపతి రావు ఆధ్వర్యంలో కార్యకర్తలు గత రెండు వారాలుగా తిరుగుతున్నారన్నారు. గుర్రంపోడ్ మండలంలో అర్హత ఉండి ఇందిరమ్మ ఇండ్లు రాని నిరుపేదలు 150 మంది వరకు ఉన్నారని అన్నారు. 'సంక్షేమ పథకాలు అమలు చేసినం.. ప్రజలంతా సంతోషంగా ఉన్నారనడం' ప్రభుత్వ అవివేకానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు రాలేదని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మెల్యేకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా బీఆర్ఎస్ పార్టీ పక్షాన లేఖలు రాస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నాట్లు నాట్లకు మధ్య రైతుబంధు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లు.. ఓట్లకు మధ్య రైతుబంధు వేస్తోందన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు గతంలో తాము అవలంబిస్తే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడానికి కూడాకార్యకర్తలు భయపడేవారన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాకముందు నీళ్లకోసం ప్రజలు బిందెలతో కిలోమీటర్ల మేర వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు.



# క్రీడావార్తలు



## వేద కృష్ణమూర్తి వీడ్కోలు



న్యూఢిల్లీ: భారత మహిళల జట్టు మిడిలార్డర్ బ్యాటర్ వేద కృష్ణ మూర్తి క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. 2017 వన్డే వరల్డ్‌కప్, 2020 టీ20 వరల్డ్‌కప్‌ల్లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టులో వేద సభ్యురాలు. కర్ణాటకలోని కడురు అనే చిన్న పట్టణం నుంచి భారత జట్టు జెర్సీని ధరించే స్థాయికి ఎదిగినందుకు సంతోషంగా ఉందని 32 ఏళ్ల వేద పేర్కొంది. 2011లో అరంగేట్రం చేసిన వేద.. భారత్ తరఫున ఐదేళ్ల క్రితమే చివరి మ్యాచ్ ఆడింది. మొత్తంగా తన కెరీర్‌లో 48 వన్డేల్లో 829, 76 టీ20ల్లో 875 రన్స్ సాధించింది.

## పట్టు బిగించారు



మాంచెస్టర్: నాలుగో టెస్టులో వరుసగా మూడో రోజూ ఇంగ్లండ్‌దే ఆధిపత్యం సాగింది. వరల్డ్ నెంబర్‌వన్ జో రూట్ (150) మరోసారి తన అత్యుత్తమ ఆటతీరుతో అదరగొట్టాడు. అతడికి జతగా కెప్టెన్ బెన్ స్టోక్స్ (77 బ్యాటింగ్), పోప్ (71) అర్ధసెంచరీలతో రాణించగా, ప్రస్తుతం ఆతిథ్య జట్టు 186 పరుగుల భారీ ఆధిక్యంతో దూసుకెళుతోంది. భారత బౌలర్లు ఎప్పటిలాగే నిరాశపర్చడంతో శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 135 ఓవర్లలో 544/7 స్కోరుతో నిలిచింది. క్రీజులో స్టోక్స్‌తో పాటు డాసన్ (21 బ్యాటింగ్) ఉన్నాడు. ఇద్దరూ బ్యాటర్లే కావడంతో నాలుగో రోజు వీలైనంత వేగంగా ఆడి తమ ఆధిక్యాన్ని పెంచాలనే భావనలో ఉన్నారు. జడేజా, సుందర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

వికెట్ కోల్పోకుండా..: 225/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఇంగ్లండ్ మూడో రోజు ఆటను ఆరంభించగా.. రూట్, పోప్ తొలి సెషన్‌లో పూర్తి ఆధిపత్యం చూపారు. భారత బౌలర్లు ఈ జోడీని విడదీయడంలో విఫలమయ్యారు. పసలేని బౌలింగ్‌తో నిరాశపర్చారు. దీంతో ఇద్దరు బ్యాటర్లు తమ అర్ధసెంచరీలను పూర్తి చేసుకున్నారు. బుమ్రా సైతం ఎలాంటి ప్రభావం చూపకపోగా.. అతడి ఓవర్లలో సులువుగా పరుగులు రాబట్టారు. పోప్ 48 రన్స్ దగ్గర ఉన్నప్పుడు అన్షుల్ ఓవర్‌లో ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను కీపర్ జురెల్ అందుకోలేకపోయాడు. మొత్తంగా ఈ సెషన్‌లో 107 పరుగులు రాబట్టిన ఇంగ్లండ్ లంచ్ విరామానికి వెళ్లింది.రూట్ శతకం: వికెట్ కోసం నిరీక్షిస్తున్న భారత్‌కు సెషన్ ఆరంభంలోనే ఆ అవకాశం దక్కింది. పాత బంతితో స్పిన్నర్ సుందర్ చక్కటి టర్న్ రాబట్టి ముందుగా పోప్‌ను అవుట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు 144 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే హ్యారీ బ్రూక్ (3) సుందర్ ఓవర్‌లో ముందుకు వచ్చి స్టంపౌట్ కావడంతో భారత్ పైచేయి సాధించినట్టు కనిపించింది. ఈ దశలో గిల్ కొత్త బంతి తీసుకోకుండా స్పిన్నర్లతోనే ఓవర్లు వేయించాడు. కానీ రూట్‌తో జత కట్టిన కెప్టెన్ స్టోక్స్ భారత్ సంబరాలకు చెక్ పెట్టాడు. ఓవైపు అన్షుల్ ఓవర్‌లో ఫోర్‌తో రూట్ శతకం పూర్తి చేశాడు. అటు 91వ ఓవర్ మధ్యలో రెండో కొత్త బంతిని తీసుకున్నా పేసర్లు ఎలాంటి ఒత్తిడి తేలేకపోయారు. సెషన్‌లో 101 పరుగులు సాధించిన ఇంగ్లండ్ జట్టు.. ఇన్నింగ్స్ 100వ ఓవర్‌లోనే స్కోరును 400 దాటించింది. ఇక డ్రింక్స్ విరామంలో వాష్‌రూమ్‌కు వెళ్లిన బుమ్రా ఐదు ఓవర్ల తర్వాత మైదానంలోకి వచ్చాడు. అయితే తను మెట్ల మీద నుంచి జారి పడినందుకే సమయం తీసుకున్నాడని వ్యాఖ్యాత నాసిర్ హుసేన్ తెలిపాడు.

## మైనర్‌పై అత్యాచారం



జైపూర్: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పేసర్ యశ్ దయాళ్‌పై మరో అత్యాచారం కేసు నమోదైంది. ఈమేరకు జైపూర్ పోలీసులు అతడిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పోలీసులు అందించిన వివరాల మేరకు..యశ్ దయాళ్ తొలిసారి 2023లో 17 ఏళ్ల బాలికపై అత్యాచారం చేశాడు. క్రికెటర్‌గా ఎదిగేందుకు సాయం చేస్తాననే సాకుతో దయాళ్ పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడట. ఈమేరకు బాలిక చేసిన ఫిర్యాదుతో భారత న్యాయ సంహితలోని సెక్షన్ 64తోపాటు, పోక్సో చట్టం కింద 27 ఏళ్ల యశ్ దయాళ్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా దయాళ్‌పై అత్యాచారం కేసు నమోదు కావడం ఇది రెండోసారి. యూపీకి చెందిన ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని ఐదేళ్లపాటు ఆమెతో సహజీవనం చేసి మోసం చేసిన కేసులో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

## వెన్నెల, తన్వికి పతకాలు ఖరారు





సోలో (ఇండోనేసియా): తెలుగమ్మాయి వెన్నెల కలగొట్ల, మరో భారత షట్లర్ తన్వీ శర్మ ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పతకాలు ఖరారు చేసుకు న్నారు. ఈ ఇద్దరు మహిళల సింగిల్స్‌లో సెమీఫైనల్స్ చేరారు. సెమీస్‌లో ఓడినా, కనీసం కాంస్య పతకాలు దక్కుతాయి. హైదరాబాద్‌కు చెందిన వెన్నెల క్వార్టర్స్‌లో 21-18, 17-21, 21-17తో జన్యాపోర్న్ మీపాన్‌థాంగ (థాయ్‌లాండ్)పై గెలిచింది. మరో క్వార్టర్స్‌లో తన్వి 21-19, 21-14తో ఐదో సీడ్ తలిట రమధాని విర్యావాన్ (ఇండోనేసియా)ను ఓడించింది. ఫైనల్ బెర్త్ కోసం సెమీస్‌లో 8వ సీడ్ యిన్ యి కింగ్ (చైనా)తో తన్వి, లూ సి యా (చైనా)తో వెన్నెల తలపడతారు. ఈ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఒకేసారి ఇద్దరు భారత షట్లర్లు సెమీస్ చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం.

## సెమీస్‌లో సాత్విక్ జోడీ



చాంగ్‌ఝౌ: చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే మహిళల సింగిల్స్‌లో వర్ధమాన షట్లర్ ఉన్నతి హుడా పయనం ముగిసింది. డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్/చిరాగ్ జోడీ 21-18, 21-14తో మలేసియా జంట ఆంగ్ యూ సిన్/టో యీ యీని చిత్తు చేసింది. ఇక పీవీ సింధుకు ప్రీక్వార్టర్ ఫైనల్లో షాకిచ్చిన ఉన్నతి..వరల్డ్ నెం. 4 అకానె యమగూచి చేతిలో పరాజయం చవిచూసింది. క్వార్టర్‌ఫైనల్లో హుడా 16-21, 12-21తో యమగూచి (జపాన్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## రిషభ్ పంత్.. ఒకప్పటి కుంబ్లేను గుర్తుకుతెచ్చాడు: మాజీల ప్రశంసలు





టీమిండియా యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ పై మాజీ ఆటగాళ్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. మూడో టెస్ట్ మ్యాచ్‌లో చేతి వేలికి గాయం అయినప్పటికీ బరిలోకి దిగి బ్యాటింగ్ చేశాడు ఇక, ప్రస్తుతం జరుగుతున్న నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో కాలికి బలమైన గాయం తగిలింది. అయినా కుంటుతూనే మైదానంలోకి దిగి అర్ధశతకం పూర్తి చేశాడు. జట్టుకు అవసరమైన కీలక పరుగులు చేశాడు. పంత్ ఫీట్‌పై మాజీ క్రికెటర్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పంత్‌ను చూస్తుంటే 2002 నాటి అనిల్ కుంబ్లే గుర్తుకు వస్తున్నాడని కామెంట్లు చేస్తున్నారు. 2002లో వెస్టిండీస్‌లో ఐదు టెస్టుల సిరీస్ కోసం భారత్ వెళ్లింది. ఆ సిరీస్‌లో నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో అనిల్ కుంబ్లే బ్యాటింగ్ చేస్తుండగా విండీస్ బౌలర్ దిల్లాన్ విసిరిన బంతి తలకు బలంగా తగిలింది. ఆ దెబ్బకు కుంబ్లే మైదానంలోనే కుప్పకూలాడు. అతడు ఆ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తాడని ఎవరూ అనుకోలేదు. అయితే కుంబ్లే తలకు కట్టు కట్టుకుని మరీ బౌలింగ్ చేశాడు. 14 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ప్రమాదకర బ్రియాన్ లారాను అవుట్ చేశాడు. ఆ మ్యాచ్‌లో కుంబ్లే పోరాటాన్ని క్రికెట్ అభిమానులు ఎవరూ మర్చిపోలేదు.మళ్లీ, కుంబ్లే తరహాలో రిషభ్ పంత్ కూడా గాయాన్ని లెక్క చేయకుండా మైదానంలోకి దిగాడు. నొప్పిని భరిస్తూనే బ్యాటింగ్ చేశాడు.

## ప్రపంచ జూనియర్ స్క్వాష్‌లో అనహత్‌కు కాంస్యం



కైరో: భారత టీనేజ్ సంచలనం అనహత్ సింగ్ ప్రపంచ స్క్వాష్ జూనియర్ %ఉష్ట్రవ% చాంపియన్‌షిప్‌లో పతకంతో సత్తా చాటింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో అనహత్ 6-11, 12-14, 10-12తో నదియెన్ ఎల్‌హమామి (ఈజిప్టు) చేతిలో ఓటమిపాలై కాంస్యం అందుకుంది. కాగా, 2010లో దీపికా పల్లికల్ తర్వాత ఈ టోర్నీలో సెమీస్ చేరిన తొలి భారత క్రీడాకారిణిగా 17 ఏళ్ల అనహత్ రికార్డుకెక్కింది.

## ఇంగ్లండ్ దూకుడు కష్టాల్లో భారత్!

మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్టులో టీమిండియా కష్టాల్లో పడింది. రెండో రోజు ఆటలో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు ఆధిపత్యం ప్రదర్శించి మ్యాచ్‌పై పట్టు సాధించింది. రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 225 పరుగులు చేసిన ఇంగ్లండ్ ఇంకా 133 పరుగులు వెనుకబడినా, 8 వికెట్లు మిగిలి ఉండటంతో.. ఈ మ్యాచ్ గెలవడం భారత్ కు గట్టి సవాల్ గా మారింది. బెన్ డకెట్ %-% జాక్ క్రాలీ జోడీ తొలి వికెట్‌కి 166 పరుగుల భాగస్వామ్యంతో భారత్ బౌలింగ్‌ను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. ఓల్డ్ ట్రాఫర్డ్‌లో ఇది ఇంగ్లండ్‌కు మూడో అతిపెద్ద ఓపెనింగ్ భాగస్వామ్యం కావడం గమనార్హం. అయితే జడేజా 32వ ఓవర్‌లో క్రాలీ (84)ను పెవిలియన్‌కి పంపి ఆ భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాడు. వెంటనే కాంబోజ్ తన తొలి టెస్టులోనే డకెట్ (94)ను అవుట్ చేసి విలువైన వికెట్ సాధించాడు. ప్రస్తుతం రూట్ (11) %-% ఓలి పోప్ (20) క్రీజులో నిలిచారు.

# బిజినెస్



## ట్రావెల్ క్రెడిట్ కార్డ్స్, వాటి ఉపయోగాలు




ఇంటర్నెట్ డెస్క్: మన దేశంలో క్రెడిట్ కార్డులు దైనందిన జీవితాలలో భాగం అయిపోయాయి. అయితే, వీటిలో పలు రకాల కార్డులు వివిధ రకాల ప్రయోజనాలు కల్పిస్తుంటాయి. ఏయే సమయాల్లో ఏ రకమైన కార్డులు ఉపయోగిస్తే లాభదాయకమో వినియోగదారులకు ఒక ఐడియా ఉంటే మెరుగైన బెనిఫిట్స్ అందిపుచ్చుకోవచ్చు. %ఎక్కువగా ప్రయాణాలు, టూరిజం ఆసక్తి ఉన్నవాళ్లకి ప్రత్యేకంగా భారతదేశంలో వివిధ రకాల ట్రావెల్ క్రెడిట్ కార్డులు అందుబాటులో ఉన్నాయి. ఇవి ఆయా బ్యాంకులు ఇచ్చే ట్రావెల్ క్రెడిట్ కార్డులు ఆయా విధాలైన బెనిఫిట్స్‌ను యూజర్లకు అందిస్తున్నాయి. ముఖ్యంగా తరచూ ప్రయాణం చేసే వారికి ఈ కార్డులు. రివార్డ్ పాయింట్లు, ఎయిర్ మైల్స్, లాంజ్ యాక్సెస్, ట్రావెల్ ఇన్సూరెన్స్ వంటి ప్రత్యేక ప్రయోజనాలను అందిస్తాయి.

## స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు




ఇంటర్నెట్ డెస్క్: భారత్‌లో బంగారం, వెండి ధరలు మరోసారి స్వల్పంగా తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (2025 జులై 25) ఉదయం 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర స్వల్పంగా తగ్గి రూ.1,00,470కు చేరుకుంది. ఇక 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం కూడా ఇదే స్థాయిలో తగ్గి రూ.92,090కు చేరుకుంది. ఇక వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.100 మేర తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 1,17,000గా ఉంది. ఇక 10 గ్రాముల ప్లాటినం ధర కూడా స్వల్పంగా తగ్గి రూ.38,880కు చేరుకుంది.

## నష్టాల్లోకి జారుకున్న సిగాచి



హైదరాబాద్: ఇటీవల పాశమైలారం ప్లాంటులో జరిగిన ప్రమాదం సిగాచీ ఇండస్ట్రీలకు పెద్ద నష్టాలే మిగిల్చింది. దీంతో తొలి త్రైమాసికంలో కంపెనీ రూ.128.2 కోట్ల ఆదాయంపై రూ.101 కోట్ల నష్టాలను చవి చూసింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.95.7 కోట్ల ఆదాయంపై రూ.12.8 కోట్ల నికర లాభం నమోదు చేసింది. ఈ ఏడాది డిసెంబరు త్రైమాసికం నుంచి కంపెనీ ఆర్థిక పరిస్థితి గాడిలో పడే అవకాశం ఉందని కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. ప్రమాదంలో దెబ్బతిన్న పాశమైలారం ప్లాంటును దశల వారీగా పునరుద్ధరించాలని కంపెనీ యోచిస్తోంది.

## సరికొత్త విజన్‌తో ముందుకొచ్చిన ఎన్ఐఏటీ..




ఇండియాలో ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్స్ అవుతున్నారు. 2024 ఆర్థిక సర్వేలో కేవలం 51 శాతం గ్రాడ్యుయేట్స్‌కి మాత్రమే ఉద్యోగావకాశాలు వచ్చినట్లు తేలింది. అందుకే ఇప్పుడు ఇండియాలో చాలా యూనివర్సిటీలు ఒక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. లో కొలాబరేట్ అవ్వడం, నెక్ట్స్ వేవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్సడ్ టెక్నాలజీస్ ఓ చక్కటి విజన్‌తో స్టార్ట్ అయింది. %చీ×ూ% 3 వేలకు పైగా కంపెనీలకు అసలు ఎలాంటి అద్భుతాలు కావాలి.. వారిలో ఏ స్కిల్స్ ఉండాలని ఇన్‌సైడ్స్‌ని రిపోర్టుగా చేసి యూనివర్సిటీలకు ఇస్తోంది. ఇలాంటి మరిన్ని సొల్యూషన్స్ కోసం.. యూనివర్సిటీలతో కొలాబరేట్ అవుతోంది. %చీ×ూ% తెస్తున్న ఈ సొల్యూషన్స్‌కు.. ఎడ్యుకేషన్ సెక్టార్స్‌లో ఎంతో పేరు తెచ్చిన సందీప్ సన్‌శెట్టి కూడా అభినందించారు. విద్యారంగంలో ఇలాంటి మార్పు రావాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం 2020లో పాలసీ ప్రవేశ పెట్టింది.

## లారస్ ల్యాబ్స్ లాభం రూ.163 కోట్లు




హైధరాబాద్: స్థానిక ఫార్మా కంపెనీ లారస్ ల్యాబ్స్ వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.1,570 కోట్ల ఆదాయంపై రూ.163 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 31.3 శాతం మాత్రమే పెరిగినా, నికర లాభం మాత్రం 1,185 శాతం పెరిగింది. కంపెనీ స్థూల లాభం కూడా 127 శాతం వృద్ధితో రూ.389 కోట్లకు చేరింది. కాంట్రాక్ట్ డెవల్‌పమెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ), జనరిక్, ఫినిష్డ్ డోసేజి ఫార్మ్స్ (ఎఫ్‌డీఎఫ్) వ్యాపారాలు పుంజుకోవడం క్యూ1లో బాగా కలిసి వచ్చాయని కంపెనీ వ్యవస్థాకులు, సీఈఓ చావా సత్యనారాయణ తెలిపారు. సీడీఎంఓ, జనరిక్, ఎఫ్‌డీఎఫ్ వ్యాపారాలను మరింత విస్తరించనున్నట్టు చెప్పారు.

## బిలియనీర్ల క్లబ్‌లోకి సుందర్ పిచాయ్



న్యూఢిల్లీ: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్, దాని మాతృ సంస్థ ఆల్ఫాబెట్‌కు సారథ్యం వహిస్తున్న సుందర్ పిచాయ్ కూడా బిలియనీర్ల జాబితాలో చేరారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. 53 ఏళ్ల పిచాయ్ వ్యక్తిగత సంపద 1.1 బిలియన్ డాలర్లకు (110 కోట్ల డాలర్లు) చేరుకుంది. అమెరికా స్టాక్ మార్కెట్లో ఆల్ఫాబెట్ షేర్లు సరికొత్త జీవనకాల గరిష్ఠానికి ఎగబాకడం ఇందుకు తోడ్పడింది. కనీసం 100 కోట్ల డాలర్ల (మన కరెన్సీలో సుమారు రూ.8,600 కోట్లు) ఆస్తి కలిగిన వారిని బిలియనీర్‌గా పిలుస్తారు. టెక్ ప్రపంచంలో వ్యవస్థాపక సీఈఓ కాని వ్యక్తి బిలియనీర్‌గా అవతరించడం అరుదైన పరిణామమే. ప్రస్తుతం పిచాయ్‌కి ఆల్ఫాబెట్‌లో 0.02 శాతానికి సమానమైన వాటా ఉంది. దాని విలువ 44 కోట్ల డాలర్లు.

## యులిప్ ప్లాన్ గురించి విన్నారా? ఒకే పాలసీలో బీమా ం పెట్టుబడి ప్రయోజనాలు..




మనలో చాలామందికి పెట్టుబడి, బీమా వంటి విషయం అంతగా అర్థం కావు. అందుకే ఎందులో పొదుపు చేయాలి? ఏ ఇన్సూరెన్స్ ప్లాన్ మంచిది? అనే ప్రశ్నలు తలెత్తుతుంటాయి. అలాగే మార్కెట్లో ఎన్ని రకాల పాలసీలు ఉన్నాయో సరిగా అవగాహన ఉండదు. అయితే, రిస్క్ లేకుండా ఇన్వెస్ట్‌మెంట్, ఇన్సూరెన్స్ ప్రయోజనాలు ఒకే పథకం ద్వారా పొందవచ్చని మీకు తెలుసా? ఈ రెండు ప్రయోజనాలను అందిస్తున్న ఆ పాలసీ పేరే యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్ మరి, ఈ స్కీం ద్వారా ఏఏ ప్రయోజనాలు ఉంటాయో.. తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో చూద్దాం. యులిప్ ద్వారా మీరు స్టాక్ మార్కెట్ లేదా డెట్ ఫండ్లలో పెట్టుబడి పెడతారు.

## ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త యూపీఐ రూల్స్ గురించి తెలుసా




%ఇంటర్నెట్ డెస్క్: యూపీఐ చెల్లింపులకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్తగా ప్రకటించిన రూల్స్ ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఆటో-పే, బ్యాంక్ బ్యాలెన్స్ చెకింగ్ వంటి అనేక సేవలకు వర్తించే ఈ రూల్స్ ఏంటో వివరంగా తెలుసుకుందాం. యూపీఐ సేవలను మరింత విశ్వసనీయంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా తీర్చి దిద్దేందుకు ఎన్‌పీసీఐ ఈ కొత్త రూల్స్‌ను ప్రకటించింది. చెల్లింపులు అధికంగా జరిగే వేళల్లో ఆటంకాలు కలగొద్దనేది ఈ రూల్స్ వెనకున్న ప్రధాన ఉద్దేశం. కొత్త రూల్స్ ప్రకారం, ఇకపై ఆటోపే చెల్లింపులు నిర్దిష్ట సమయాల్లోనే జరుగుతాయి. మునుపటిలా రోజంతా ఈ చెల్లింపులకు ఆస్కారం ఉండదు. ఆటో పేమెంట్స్, సబ్‌స్క్రిప్షన్స్, యూటిలిటీ బిల్స్, ఈఎమ్ఐ వంటి వాటన్నిటికీ ఈ కొత్త రూల్ వర్తిస్తుంది. ఇవన్నీ తెరవెనుక జరిగే కార్యకలాపాలే. అయితే, ఆటోపేమెంట్స్‌కు ప్రత్యేక సమయాలు కేటాయించడం ద్వారా యూపీఐ వేదికపై ఒత్తిడి తగ్గుతుంది. ఈ నేపథ్యంలో ఆటోపే సేవను వినియోగించే వ్యాపారాలు తమ షెడ్యూల్‌లో మార్పులు చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 1 నుంచి వినియోగదారులు యూపీఐ ద్వారా తమ అకౌంట్ బ్యాలెన్స్‌ను రోజుకు 50 సార్లు మాత్రమే చెక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ నిబంధనలు యూపీఐ సర్వీసును వినియోగించే వారందరికీ వర్తిస్తాయి. ఇక డిజిటల్ చెల్లింపులపై చార్జీల విధింపు గురించి ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీఐ చెల్లింపుల వ్యవస్థకు ఆర్థిక సుస్థిరత చేకూర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం చెల్లింపులకు అయ్యే ఖర్చును సబ్సిడీ రూపంలో ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. ఈ విధానం ఎక్కువ కాలం మనలేదని స్పష్టం చేశారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006